# 'బోనస్' బకాయి.. రూ.63.53 కోట్లు




ఖమ్మం రూరల్లో కొనుగోలు చేసిన యాసంగి ధాన్యం (ఫైల్)

- కొనుగోలు కేంద్రాలు మూసివేసినా కర్షకుల ఖాతాల్లో పడని బోనస్ నగదు
- యాసంగి ముగిసినా ధాన్యం బోనస్‌ను జమ చేయని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- వానకాలం పనులు జోరుగా సాగుతున్నా అన్నదాతలకు తప్పని ఎదురుచూపులు
- పంటల పెట్టుబడికి వినియోగించుకుందామన్నా ఇవ్వని కాంగ్రెస్ సర్కారు
- నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో 48 గంటల్లోనే జమ చేసిన అప్పటి సీఎం కేసీఆర్
- నేటి కాంగ్రెస్ సర్కారులో సీజన్లు దాటిపోతున్నా జమ చేయని సీఎం రేవంత్
- ఇప్పటికే అకాల వర్షాలకు యాసంగి ధాన్యం కొట్టుకుపోయి నష్టపోయిన రైతులు

**క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామంటూ అన్నదాతలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ తరువాత వారిని అడుగడుగునా మోసం చేస్తోంది. తొలుత 'క్వింటా వడ్లకు రూ.500 బోనస్' అంటూ ఎన్నికల్లో మాట ఇచ్చిన రేవంత్.. తీరా గెలిచాక 'సన్న వడ్లకే రూ.500 బోనస్' అంటూ మాట మార్చారు. అలా గత సీజన్‌కు ఎగనామం పెట్టిన సీఎం రేవంత్.. ఇప్పుడు సన్న వడ్లు పండించి విక్రయించిన రైతులకూ సకాలంలో బోనస్ జమ చేయకుండా పంగనామాలు పెడుతున్నారు. ఇటీవల ముగిసిన యాసంగిలో కూడా ఖమ్మం జిల్లా రైతుల నుంచి సన్న వడ్లను కొనుగోలు చేసిన కాంగ్రెస్ సర్కారు.. తాజాగా వానకాలం సీజన్ మొదలైనా బోనస్ ముచ్చట ఎత్తింది లేదు. సకాలంలో జమ చేసిందీ లేదు. దీంతో యాసంగి బోనస్ నగదుతోనైనా వానకాలం పంటలకు పెట్టుబడి పెట్టుకుందామనుకున్న అన్నదాతలకు నిరాశ తప్పడం లేదు.**

**–రఘునాథపాలెం, జూన్ 24**

ఇటీవలి యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల సమయంలో అన్నదాతలను అష్టకష్టాలు పెట్టింది కాంగ్రెస్ సర్కారు. వరి కోతలు మొదలైన వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ఆలోపే అకాల వర్షాలు కురవడంతో కల్లాల్లోని ధాన్యమంతా తడిసిపోయింది. కొట్టుకుపోయింది. దీంతో అన్నదాతలకు తీరని నష్టం మిగిలింది. తర్వాత తీరిగ్గా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ వాటిల్లో సౌకర్యాలు కల్పించకపోవడం, టార్పాలిన్లు అందుబాటులో ఉంచకపోవడం, గన్నీ బస్తాలు తగినన్ని సమకూర్చకపోవడం, కాంటాలను సకాలంలో పూర్తి చేయకపోవడం, తేమ శాతం పేరుతో రోజుల తరబడి ధాన్యాన్ని ఆరబోయించడం వంటి కారణాలతో కొనుగోళ్లను మరింత జాప్యం చేసింది. దీంతో విరామం లేకుండా అకాల వర్షాలు కురవడంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యమంతా తడిసి ముద్దయింది. కొన్ని చోట్ల తడిచి ముద్దయింది. మరి కొన్ని చోట్ల మొలకెత్తింది. ఫలితంగా అన్నదాతలు ఆసాంతం నష్టపోయారు. ఈ కష్టాలన్నింటినీ దాటుకొని, ధాన్యాన్ని భద్రంగా కాపాడుకొని ప్రభుత్వానికి విక్రయించిన కర్షకులకు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ చుక్కలు చూపిస్తోంది. చివరికి బోనస్ నగదు కూడా సకాలంలో ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతోంది. యాసంగిలో ధాన్యాన్ని విక్రయించిన వెంటనే ధాన్యం నగదును, బోనస్ నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాల్సిన ప్రభుత్వం.. నెలల తరబడి జాప్యం చేస్తూ వస్తోంది. ధాన్యం నగదును కూడా చాలా రోజులకు జమ చేసిన రేవంత్ సర్కారు.. బోనస్ సొమ్మును మాత్రం ఇప్పటికీ విడుదల చేయలేదు. దీంతో యాసంగిలోనే తమ రెక్కల కష్టానికి బోనస్ ఫలాన్ని అందుకోని అన్నదాతలు.. నేటికీ ఆ నగదు కోసం కళ్లలో ఒత్తులేసుకొని మరీ ఎదురుచూస్తున్నారు. ఇంతలో వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో ఇప్పటికైనా బోనస్ వస్తుందేమో, దానితో ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసుకుందామేమో, పంటల పెట్టుబడికి వినియోగించుకుందామేమో అనే అన్నదాతల ఆశలు నెరవేరేలా లేవు. బోనస్ నగదు ఎప్పుడు జమ అవుతాయంటూ కార్యాలయాలకు పరుగులు పెట్టి అడిగినా సరైన సమాధానం లేదు.



అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని టబ్బులోకి ఎత్తుతున్న రైతులు (ఫైల్)

## వానకాలం వచ్చినా బోనస్ పెండింగ్

సన్న వడ్లకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామంటూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి లబ్ధిపొందిన కాంగ్రెస్.. ఇప్పుడు మాత్రం అదే బోనస్‌ను పెండింగ్ పెట్టి అన్నదాతలను అష్టకష్టాల పాలు చేస్తోంది. ధాన్యం కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా, సీజన్లు దాటిపోతున్నా వడ్లను విక్రయించిన రైతులకు మాత్రం బోనస్ నగదును జమ చేయడం లేదు. కేవలం బోనస్ నగదే ఖమ్మం జిల్లా రైతులకు రూ.63.53 కోట్లను పెండింగ్ పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం. వానకాలం సీజన్ మొదలై వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నప్పటికీ బోనస్ జమ చేసిన పాపాన పోలేదు. బోనస్ జమ అయితే నాట్లకైనా, కూలీలకైనా ఇచ్చేందుకు అక్కరకొస్తాయనుకున్న అన్నదాతల ఆశలు అడియాశలవుతున్నాయి.

## 12.70 లక్షల క్వింటాళ్ల కొనుగోలు

ఖమ్మం జిల్లాలో ఇటీవలి యాసంగి ధాన్యాన్ని ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. మొత్తం 18,855 మంది రైతుల నుంచి 12,70,653 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించింది. అయితే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తక్షణమే వారి ఖాతాల్లో నగదును జమ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ మాటను కూడా తప్పింది. గత బీఆర్ఎస్ సర్కారులో ధాన్యం విక్రయించిన రైతుకు 48 గంటల్లోనే దాని నగదు అతడి బ్యాంకు ఖాతాలో జమ అయ్యేది. కానీ.. కాంగ్రెస్ సర్కారులో మాత్రం రోజులు, నెలల వ్యవధి పట్టింది. ఇక బోనస్ విషయం మాత్రం మరీ దయనీయం. యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యానికి ఇవ్వాల్సిన బోనస్‌ను వానకాలం ప్రారంభమైనా ఇవ్వలేదు. దీంతో అన్నదాతలందరూ నిత్యం తమ బ్యాంకు ఖాతాల్లో నిల్వలను పరిశీలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



కల్లంలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీఎస్‌వో (ఫైల్)

# రైతులకు ఏ మేలూ చేయకుండా వారోత్సవాలెందుకు?



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే 'రైతుభరోసా' డ్రామా
- బీఆర్ఎస్ హయాంలోనే 'సీతారామ' 90 శాతం నిధులు
- 30న సీఎం చిత్రపటానికి పిండప్రదానం చేస్తూ నిరసన
- నాయకులు, కార్యకర్తలు పూసుగూడెం తరలిరావాలి
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు టౌన్, జూన్ 24: ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చకుండా రైతులను, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు స్పష్టం చేశారు. రైతులకు ఏం మేలు చేశారని వారోత్సవాలు జరుపుతున్నారని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే 'రైతుభరోసా' డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. మణుగూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి జిల్లా రైతులను మోసగించి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్ జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీరు అందించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇక్కడి బీడు భూముల సస్యశ్యామలం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాంతంలో సీతారామ ప్రాజెక్టును చేపట్టి 90 శాతం నిర్మించారని అన్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఖమ్మానికి చెందిన ముగ్గురు మంత్రులు భద్రాద్రి జిల్లా రైతాంగానికి ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఇవ్వకుండా వారి ఖమ్మం జిల్లా రైతులకు నీళ్లు తీసుకెళ్తున్నారని అన్నారు. దీనికి వ్యతిరేకంగా భద్రాద్రి జిల్లా రైతుల తరఫున దశలవారీ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు మేలు చేయని రైతు వారోత్సవాలు ఎందుకని రేగా ప్రశ్నించారు. రుణమాఫీ చేయకుండారైతుల నోట్లో మన్ను కొట్టినందుకా?, రెండుసార్లు రైతుభరోసాకు ఎగనామం పెట్టినందుకా; లేకపోతే రైతుబీమాను విస్మరించి రైతులను నిట్టనిలువునా ముంచినందుకా? అంటూ ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిస్తే మళ్లీ రైతులను పట్టించుకునే దాఖలాలు ఉండవని ఆరోపించారు. అలాగే, ఇటీవల ఆరుగురు మంత్రులతో కలిసి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి హడావిడిగా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ప్రాజెక్టు రెండో పంపుహౌస్‌ను ప్రారంభించారని అన్నారు. మరి ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇస్తున్నారని ప్రశ్నించారు? సీతారామ నీళ్లను భద్రాద్రి జిల్లా రైతులకు ఇవ్వకుంటే ఊరుకోబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా ఈ నెల 30న పూసుగూడెం వద్ద సీఎం రేవంత్ చిత్రపటానికి పిండప్రదానం చేస్తూ నిరసన తెలియజేస్తామని అన్నారు. ఈ ఆందోళన కార్యక్రమానికి జిల్లాలోని పార్టీ శ్రేణులన్నీ కదిలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్, మాజీ జెడ్పీటీసీ పోషం నర్సింహారావు, మాజీ మండల అధ్యక్షుడు అడపా అప్పారావు, యాదగిరి గౌడ్, రాంకోటి, సృజన్, నర్సింహారావు పాల్గొన్నారు.

# ఎరియర్స్ కోసం మున్సిపల్ కార్మికుల నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మణుగూరు టౌన్, జూన్ 24: పెండింగ్‌లో ఉన్న ఎరియర్స్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మిక యూనియన్ (సీఐటీయూ అనుబంధ) ఆధ్వర్యంలో కార్మికులు మణుగూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ కార్మికులకు 22 నెలల ఎరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ డిపెండెంట్ ఉద్యోగులు వీటి కోసం గతంలో ఆందోళనలు చేయడంతో మూడు నెలల ఎరియర్స్ నెలలోపు ఇస్తామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చి నెలలు గడిస్తున్నా అతీగతీ లేదన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో మళ్లీ నిరసన చేపట్టామన్నారు.

# పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

**కామేపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా**



ధర్నా నిర్వహిస్తున్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, బీఆర్ఎస్ శ్రేణులు

కారేపల్లి (కామేపల్లి), జూన్ 24: ప్రభుత్వం గ్రామపంచాయతీలకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కామేపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ధర్నా నిర్వహించారు. తొలుత బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా హరిప్రియానాయక్ మాట్లాడుతూ గ్రామపంచాయతీకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయన్నారు. వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పేదలకు దక్కాల్సిన ఇందిరమ్మ ఇండ్లను కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీలు తమకు అనుకూలంగా ఉన్న వారికి మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు అంతోటి అచ్చయ్య, ఒడియాల కృష్ణారెడ్డి, మల్లెంపాటి శ్రీనివాసరావు, నాయకులు కాత్రాల్ రాంబాబు, సామ మోహన్‌రెడ్డి, బట్టు శంకర్, మూడు కృష్ణప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ అజ్మీరా రాజు, మాజీ సర్పంచ్ జాటోతు లూసి, ముత్యం రామకృష్ణ, అంగడాల అనంతరాములు, కంపసాటి సురేశ్, కన్నమాల రాంబాబు, మంచాల వెంకన్న, దుద్దుకూరు రాంబాబు, ఆదూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- ఖమ్మంలో మూడో రోజుకు చేరుకున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్ల దీక్షలు
- మున్సిపల్ కార్మికులతో పనులు చేయించేందుకు అధికారుల యత్నం
- తమ పొట్టకొట్టొద్దంటూ చేతులెత్తి పోలీసులను వేడుకున్న వేతన జీవులు



మున్సిపల్ కార్మికులతో పనులు చేయించి తమ పొట్ట కొట్టొద్దంటూ చేతులెత్తి మొక్కుతున్న ఆసుపత్రి కార్మికులు

# పెద్దాసుపత్రిలో ఆందోళన



ఖమ్మం సిటీ, జూన్ 24: ఖమ్మం జిల్లా ప్రభుత్వాసుపత్రి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె రోజురోజుకూ ఉధృతంగా మారుతోంది. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య ధోరణి, ముగ్గురు మంత్రుల అలసత్వం, వైద్యాధికారుల మొండితనంతో విసిగి వేసారిన 259 మంది వేతన జీవులు ఆకలి కేకలతో ప్రాంగణాన్ని హోరెత్తిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కూడా దవాఖాన ఎదుట దీక్షకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చేతిలో చిల్లిగవ్వ లేక ఇంటిల్లిపాది ఆకలితో అలమటిస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ క్రమంలో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు మున్సిపల్ కార్మికులు అక్కడికి చేరుకోవడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. తాము కూడా నిరుపేద కార్మికులమేనని, తమకు సహకరించాల్సింది పోయి అధికారులు చెబితే ఎలా వస్తున్నారని నిలదీశారు. సమాచారం అందుకున్న ఖమ్మం టూటౌన్ పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. విధులు నిర్వహించేందుకు వచ్చిన వారిని అడ్డుకోవద్దని, మాట వినకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో తీవ్ర అసహనం వ్యక్తం చేసిన కార్మికులు.. తమ గోడు ఆలకించాలని చేతులెత్తి మొక్కారు. అరెస్టులకైనా వెనుకాడేది లేదంటూ వాగ్వాదానికి దిగారు. చేసేదేమీ లేక మున్సిపల్ కార్మికులు, పోలీసులు అక్కడి నుంచి వెనుదిరగడంతో వివాదం సద్దుమణిగింది.

### కాంగ్రెస్ పాలనలోనే సమస్యలు..

తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంత వరకు ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులు మొత్తానికి నెలనెలా వేతనాలు వచ్చేవని సీఐటీయూ నాయకుడు టీ.విష్ణువర్ధన్, టీయూసీఐ నాయకుడు గండమాల రామయ్య అన్నారు. ఆనాడు 575 బెడ్లకు సరిపడా నిధులు మంజూరు చేశారని చెప్పారు. కానీ.. కాంగ్రెస్ సర్కారు హయాంలో ఈ దవాఖాన డీఎంఈ పరిధిలోకి వెళ్లడం, కేవలం 475 బెడ్లకే నిధులు చెల్లిస్తుండడం వంటి కారణాలతో వేతన సమస్య నెలకొందని వివరించారు. ఏడాదిన్నరగా ఈ విషయాన్ని జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు, డీఎంఈకి తెలియజేసినా ఎటువంటి ప్రయోజనమూ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిసారీ ధర్నాకు దిగితే తప్ప జీతాలు ఇవ్వని పరిస్థితి తలెత్తుతోందని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టి మంత్రుల ఇళ్లను, పర్యటనలను అడ్డుకుంటామని కార్మికులు హెచ్చరించారు.



పెద్దాసుపత్రి ప్రధాన ద్వారం వద్ద దీక్ష చేస్తున్న కార్మికులు

### దవాఖానా? డంపింగ్ యార్డా?

గత ప్రభుత్వంలోని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో నాణ్యమైన వైద్యవలందించిన ఖమ్మం పెద్దాసుపత్రి పరిస్థితి ప్రస్తుతం దిగజారిపోతోంది. నెలల తరబడి వేతనాలు చెల్లించని కారణంగా కార్మికులు సమ్మెకు దిగిన నేపథ్యంలో వార్డుల్లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. జనరల్ వైద్యసేవలతోపాటు ప్రసవాల కోసం వస్తున్న వారంతా అక్కడి వాతావరణం చూసి 'ఇది దవాఖానా? లేక డంపింగ్ యార్డా?' అంటూ అసహ్యించుకుంటున్నారు. అక్కడ వెలువడుతున్న కంపు వాసన తట్టుకోలేక ముక్కులు మూసుకుంటూ ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఇన్‌పేషెంట్లుగా చేరిన వారికి కనీసం మంచినీళ్లు ఇచ్చే నాథుడు కూడా లేడు.

# అర్హులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**బూర్గంపహాడ్ తహసీల్ ఎదుట గోదావరి ముంపు బాధితులు, ఆదివాసీల ధర్నా**




బూర్గంపహాడ్ తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు, పీవోడబ్ల్యూ నాయకులు

బూర్గంపహాడ్, జూన్ 24: హైకోర్టు తీర్పును అమలు చేస్తూ గోదావరి వరద ముంపు బాధితులు, నిరుపేద ఆదివాసీలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతుకూలీ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘాల ఆధ్వర్యంలో బాధితులు బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల జిల్లా కార్యదర్శులు పున్నంచంద్, తోలెం మమతలు మాట్లాడుతూ ఏటా గోదావరి వరదలతో ముంపు గ్రామాలు, కాలనీలు నీట మునిగి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్న వారికి, ఇంటి స్థలాలు లేని నిరుపేద ఆదివాసీలకు స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ సమస్యపై పలుమార్లు ఆందోళనలు చేశామని గుర్తు చేశారు. వీరంతా అటవీ శాఖ పరిధిలో ఉన్న 437/1 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేశారని, వాటిని అటవీ శాఖ అధికారులు వాటిని కూల్చివేయడంతో బాధితులు హైకోర్టుకు వెళ్లడంతో వీరికి పట్టాలు ఇవ్వాలని తీర్పు చెప్పిందన్నారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం అందజేశారు. కుంజా సోమక్క, సోంది గోపమ్మ, గంజి కోటమ్మ, శాంతికుమారి, వెంకటనర్సమ్మ, కుంజా వెంకటేశ్వర్లు, కారం నర్సింహారావు, నాగయ్య, ఊకె సుశీల, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రిటైనింగ్ వాల్ పనుల్లో వేగం పెంచండి

- 17 కిలోమీటర్ల వాల్‌కు 138 ఎకరాలు అవసరం
- నిర్వాసితులతో చర్చించి భూ సేకరణ చేపట్టండి
- క్షేత్రస్థాయి పర్యటనలో ఖమ్మం కలెక్టర్ అనుదీప్



మున్నేరు పరీవాహకంలో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మం రూరల్, జూన్ 24: మున్నేరుకు ఇరువైపులా చేపట్టిన రిటైనింగ్ వాల్ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి నగరంలోని మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతి, నిర్వాసితులకు పోలెపల్లి వద్ద కేటాయించనున్న ప్రభుత్వ స్థలాన్ని క్షేత్రస్థాయిలో కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. కరుణగిరి, రాజీవ్ గృహకల్ప, పోలెపల్లి వద్ద క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. రిటైనింగ్ వాల్, డ్రెయిన్, రోడ్డు నిర్మాణ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎర్త్ వర్కు 41 శాతానికి పైగా, సిమెంట్ కాంక్రీట్ పనులు 32 శాతం పూర్తయ్యాయని, నగరం నుంచి వచ్చే వరద నీరు నిర్వహణ, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి గల చర్యలపై అధికారులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మున్నేరుకు ఇరువైపులా ఎనిమిదిన్నర కిలోమీటర్ల చొప్పున 17 కిలోమీటర్లు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని, ఇందుకోసం 138 ఎకరాల పట్టా భూమిని సేకరించాల్సి ఉందన్నారు. అయితే పోలెపల్లిలో సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన 300 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసి నిర్వాసితులకు పరిహారంగా అందించేలా ఒప్పించాలన్నారు. ఆకేరు, మున్నేరు నీటి మట్టం, వరద ప్రవాహ ఉధృతిపై ముందస్తు సమాచారం చేరవేసి ప్రజలకు, ఆస్తులకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆర్డీవో జి.నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేశ్, తహసీల్దార్లు సైదులు, పి.రాంప్రసాద్, ఇరిగేషన్ డీఈ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.